# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 10-02-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ ఢిల్లీ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పలువురు కేంద్ర మంత్రులతో ఈరోజు సమావేశమయ్యారు.
- ❖ రాష్ట్రంలో చేపడుతున్న సేంద్రీయ వ్యవసాయ సాగుకు మద్దతునివ్వాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.
- ❖ రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు రేపటి నుండి ప్రారంభం కానున్నాయి.
- ❖ మహా శివరాత్రిని పురస్కరించుకొని రాష్ట్రంలోని అన్ని శైవ దేవాలయాల్లో పటిష్ట ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు.

=====================

ఢిల్లీ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తో ఈరోజు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని వివిధ రైల్వే ప్రాజెక్టుల పూర్తి, కొత్త రైలు మార్గాలు, సర్వీసులకు సంబంధించిన విజ్ఞాపన పత్రాన్ని కేంద్రమంత్రికి అందించారు. ఇటీవల బడ్జెట్టులో ప్రకటించిన హైదరాబాద్ - బెంగళూరు, హైదరాబాద్ - చెన్నై, చెన్నై- బెంగళూరు హై స్పీడ్ రైల్ కారిడార్ల గురించి ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రస్తావించారు. బెంగళూరు-చెన్నై హై స్పీడ్ రైల్ కారిడారును తిరుపతికి అనుసంధానించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలు ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమయ్యేలా గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. విజయవాడ, విశాఖ, తిరుపతి, అమరావతిలలో గ్రీన్ ఫీల్డ్ మెగా కోచింగ్ టెర్మినళ్లు ఏర్పాటు చేయాలని, విశాఖ-విజయవాడల మధ్య హైస్పీడ్ రైల్ కారిడార్, విజయవాడ-కర్నూలు మధ్య సెమీ హైస్పీడ్, తిరుపతి-చిత్తూరు మధ్య హైస్పీడ్ లింక్ కారిడార్ మంజూరు చేయాలని విన్నవించారు. ఆంధ్రప్రదేశ్ లోని పోర్టులను అనుసంధానిస్తూ... విజయవాడ మీదుగా ఖరగ్ పూర్- చెన్నై మధ్య ఈస్ట్ కోస్ట్ ఫ్రైట్ కారిడార్ ఏర్పాటు చేయాలని అశ్వినీవైష్ణవ్‌కు విజ్ఞప్తి చేశారు.

అంతకుముందు కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. రాష్ట్రంలో వ్యవసాయం సహా అనుబంధ రంగాల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలపై ఆయనతో

చర్చించారు. సేంద్రీయ వ్యవసాయ సాగుపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని కేంద్రమంత్రికి తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ రంగ అభివృద్ధికి తమ వంతు సహాయాన్ని అందించాలని కేంద్రాన్ని కోరినట్లు తెలిపారు. PM-PRANAM పథకం కింద AP కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్ ను విస్తరించడానికి నిధులు విడుదల చేయాలని కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. అదే విధంగా కొబ్బరి సాగు అభివృద్ధికి 200 కోట్ల రూపాయల మేర సహాయం చేయాలని, 2025-26 సీజన్‌లో తోతాపూరి మామిడికి కేంద్ర వాటాగా ఇవ్వాల్సిన 100 కోట్ల రూపాయల నిధులను విడుదల చేయాలని కోరినట్లు ముఖ్యమంత్రి వెల్లడిస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

అంతకుముందు కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సీ.ఆర్. పాటిల్, హోం శాఖ మంత్రి అమిత్ షా, ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ లతో కూడా ముఖ్యమంత్రి వేర్వేరుగా సమావేశమయ్యారు.

=====================

అంసెబ్లీ బడ్జెట్ సమావేశాలు రేపటి నుండి ప్రారంభంకానున్నాయి. ఈ బడ్జెట్ సమావేశాల నిర్వహణపై ఏపీ అసెంబ్లీ కమిటీ హాల్లో వివిధ శాఖల కార్యదర్శులతో శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఈరోజు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానంగా అసెంబ్లీలో సభ్యులు అడిగే ప్రశ్నలకు సంబంధిత శాఖల అధికారులు సకాలంలో సమాధానాలు పంపాలని స్పీకర్ అధికారులకు స్పష్టం చేశారు. వచ్చే వర్షాకాల సమావేశాలను నేషనల్ ఈ-విధాన్ కింద డిజిటల్ విధానంలో చేపట్టేందుకు కృషి జరుగుతోందని చెప్పారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్, ఉప శాసన సభాపతి కె. రఘు రామకృష్ణంరాజు ఇతర అధికారులు పాల్గొన్నారు.

=====================

మహా శివరాత్రిని పురస్కరించుకొని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న శైవ క్షేత్రాలలో పటిష్టమైన చర్యలు తీసుకోవాలని దేవదాయ, ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా శ్రీశైలం సహా వివిధ శైవ క్షేత్రాల్లో భక్తుల రద్దీ, వసతులు, ఏర్పాట్లపై మంత్రి దృశ్య మాధ్యమం ద్వారా ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దర్శనం విషయంలో సామాన్య భక్తులకు మొదట ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, మహా శివరాత్రి వంటి కీలక సందర్భాల్లో అన్ని విభాగాలు పూర్తి సమన్వయంతో పని చేయాలని మంత్రి పేర్కొన్నారు.

=====================

పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం ఉద్యోగులకు ప్రార్థనల కోసం పని ముగింపు వేళల్లో ఒక గంట అనుమతినిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలలో పనిచేసే ముస్లిం ఉద్యోగులందరూ సాయంత్రం పనివేళల ముగింపు కంటే ఒక గంట సమయం ముందుగానే పని ముగించుకొని వెళ్లేందుకు అనుమతులు మంజూరు చేస్తూ.. ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ సిబ్బంది, స్వర్ణ గ్రామ, వార్డు సచివాలయాలతో పాటు అన్ని ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహించే ముస్లిం ఉద్యోగులందరికీ ఇది వర్తిస్తుందని పేర్కొన్నారు. ఈ మేరకు సంబంధిత అన్ని ప్రభుత్వ శాఖల విభాగ అధిపతులకు, జిల్లా కలెక్టర్లకు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులకు అనుగుణంగా మార్గదర్శకాలు అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశించినట్లు చెప్పారు.

విరామం

=====================

ఏలూరు డెవలప్‌మెంట్ అథారిటీ మంజూరు చేసిన ఐదు కోట్ల రూపాయలతో పాలకొల్లు పట్టణంలో పడుతున్న అభివృద్ధి పనులను రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి

పాత్రికేయులతో మాట్లాడుతూ... మంచినీరు చెరువుపై వాకింక్ ట్రాక్ ను, దానికి ఫెన్సింగ్ ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మొక్కలు నాటడంతో పాటు బెంచీలు ఇతర సౌకర్యాలు కల్పిస్తామని మంత్రి వివరిస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

=====================

రాష్ట్రంలో రైతులకు వేగవంతమైన, పారదర్శకమైన కాగిత రహిత సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రారంభించిన "మన మిత్ర" వాట్సాప్ ఆధారిత గవర్నెన్స్ ప్లాట్ ఫారంలో ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు (APMIP)ను జోడించడం ద్వారా రైతులకు మరింత సులభమైన సేవలు అందుబాటులోకి వచ్చాయని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఈరోజు ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు తమ మొబైల్ ఫోన్ ద్వారా 95523 00009 నంబర్‌కు వాట్సాప్‌లో "Hi" అని సందేశం పంపడం ద్వారా APMIPను ఎంపిక చేసుకొని రాయితీ కోసం నమోదు, దరఖాస్తుల స్థితిగతులు, గ్రీవెన్స్ నమోదు, నాన్-సబ్సిడీ చెల్లింపులు వంటి కీలక సేవలను ఇంటి నుంచే పొందవచ్చని ఆయన పేర్కొన్నారు. ఉద్యానవన శాఖలో రైతులకు అందుతున్న సేవలు మరింత సులభతరంగా మారాయని, డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్ సిస్టమ్‌లు, సోలార్ పంపులు వంటి పరికరాలను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునే సౌకర్యంతో పాటు.. నగదు చెల్లింపులు కూడా సురక్షితంగా ఇంటి నుంచే చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు.

=====================

ప్రజల్లో దేశభక్తిని పెంపొందించడం, వందేమాతరం గేయం స్ఫూర్తిని గుర్తు చేయడం, తీరప్రాంత ప్రజలకు కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడమే వందేమాతరం కోస్టల్ సైక్లోథాన్-2026 లక్ష్యమని కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సీఐఎస్ఎఫ్) సీనియర్ కమాండెంట్ సంజీత్ కుమార్ అన్నారు. సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన వందేమాతరం కోస్టల్ సైక్లోథాన్ ఈరోజు ఒంగోలు చేరుకుంది. ఈ సైకిల్ యాత్రకు ఒంగోలు జిల్లా పోలీసు కార్యాలయం వద్ద సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఐఎస్ఎఫ్ సీనియర్ కమాండెంట్ సంజీత్ కుమార్ ఆకాశవాణితో మాట్లాడుతూ... ఫిట్ ఇండియా, బేటీ బచావ్... బేటీ పఢావ్.. వంటి కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ.. వారికి వందేమాతరం స్ఫూర్తిని వివరిస్తూ.. ఈ సైక్లోథాన్ నిర్వహిస్తున్నామన్నారు. 9 రాష్ట్రాల మీదుగా 6 వేల 500 కిలోమీటర్లకు పైగా సాగే ఈ సైక్లోథాన్ లో 70 మంది పాల్గొంటున్నారని తెలిపారు. జనవరి 28న కోల్ కత్తాలో ప్రారంభమైన ఈ సైకిల్ యాత్ర ఫిబ్రవరి 22వ తేదీన కేరళలోని కొచ్చి తీరాన్ని చేరుకోవడంతో ముగుస్తుందన్నారు.

=====================

ప్రస్తుత తరుణంలో ప్రతి ఒక్కరూ ఆధునిక పరికరాలను ఇంటర్ నెట్ అనుసంధానంతో విరివిగా ఉపయోగిన్న నేపథ్యంలో ఆన్‌లైన్  మోసాలకు గురికాకుండా జాగ్రత్తగా ఉండాల్సిన అవసరముందని విజయనగరం జిల్లా రెవెన్యూ అధికారి మురళి అన్నారు. విజయనగరం కలెక్టర్ కార్యాలయం ఆడిటోరియంలో ఈరోజు "సురక్షిత అంతర్జాల దినోత్సవం" సందర్భంగా ఎన్ఐసి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యశాలలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అనంతరం మాట్లాడుతూ.. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానం వల్ల ఆధునిక మొబైల్ ఫోన్లు అందరికీ అందుబాటులో ఉన్నాయని, అవి అవసరం మేరకే వినియోగించాలని సూచించారు. అంతర్జాలం ద్వారా ఆన్‌లైన్ మోసాలకు గురి కాకుండా ఉండాలంటే మొబైల్ ఫోన్లు, డెస్క్ టాప్, లాప్ టాప్ లకు టూ ఫేక్టర్ అథెంటికేషన్ ఏర్పాటు చేసుకోవాలని.. ఎప్పటికప్పుడు పాస్ వర్డ్ లు మార్చుకోవాలని సూచించారు. పరిచయం లేని వ్యక్తుల నుండి సంక్షిప్త సందేశాలు, వీడియో కాల్స్ లింక్స్ ల రూపంలో వస్తే సమాధానం ఇవ్వరాదని తెలియజేశారు.

=====================
=====================